క్లుప్తంగా

రహదారి మరమ్మతు చేయాలి

వనపర్తి రూరల్: సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి ఆధ్వర్యంలో జిల్లా నాయకులతో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్, విశ్వేశ్వర్‌రెడ్డి ఆసుపత్రి, నుంచి మసీదువరకు అలాగే బ్రహ్మంగారి వీధిలోని పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. ఆయా కాలనీల్లో సమస్యలను అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, కురుమయ్య, మదన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఆత్మకూర్: ఆత్మకూర్‌కు చెందిన వివాహిత మహిళ కనిపించకుండా పోయిన ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన వడ్డె తిరుపతికి ఇద్దరు భార్యలు. రెండో భార్య అంజమ్మ అలకబూని ఈ నెల 15న ఆస్పత్రికి వెళ్లివస్తానని చెప్పి నేటివరకు రాలేదన్నారు. దీంతో బంధువుల వద్ద ఆరాతీసిన ఆచూకీ లభించకపోవడంతో సోమవారం భర్త ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎంపీఓకు సన్మానించిన ఎంపీడీఓ

అమరచింత: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనపర్చిన ఎంపీఓ నర్సింహులుకు అవార్డు అందుకోవడం సంతోషకరమంటూ ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది దేవన్న, యాదయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకం అందజేత

కొత్తకోట రూరల్: ఆర్మీ అగ్నిపథ్ రాత పరీక్షల్లో అర్హత సాధించిన యువకులకు నగదును అందజేసి ప్రోత్సహించారు. రాతపరీక్షలో అర్హత సాధించి ఎంపికైన పెద్దమందడి మండలంలోని యువకులు యువరాజు, రాకేష్, శరత్, సూరచందు, కార్తీక్‌లకు అయ్యపురెడ్డి కుటుంబ సభ్యులు ఒక్కొక్కరికి రూ.3,000 చొప్పున ఎస్ఐ శివ కుమార్ చేతుల మీదుగా అందజేశారు.

వైభవంగా వీరభద్రస్వామి ఉత్సవాలు

ఖిల్లాఘనపురం: మండలకేంద్రంలో సోమవారం వీరభద్రస్వామి ఉత్సవాలను ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని వాసనాగేశ్వర్ ఇంటినుంచి ఉత్సవ విగ్రహంతో పురవీధుల గుండా ఊరేగించారు. సంఘం సభ్యులు పాలవాది రాజు, వాసనాగేశ్వర్, విశ్వం తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి జయంతి

ఆత్మకూర్: మాజీఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి జయంతిని సోమవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహాసిద్ధార్థరెడ్డి, రామలక్ష్మీ రెడ్డి, బాలకృష్ణరెడ్డి, రాములు, ఎస్టీడీ శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి రైతునేస్తానికి హాజరుకావాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం నిర్వహిస్తామని ఏవో డాకేశ్వర్‌గౌడ్, ఉద్యానశాఖ కో ఆర్డినేటర్ రవి తెలిపారు. పాతమామిడి తోటల పునరుజ్జీవనం అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. శాస్త్రవేత్తలు తగు సూచనలు, సలహాలు ఇస్తారని తప్పనిసరిగా రైతులు పాల్గొనాలని కోరారు.

సతీష్‌యాదవ్‌కు సన్మానం



వనపర్తి విద్యావిభాగం: సేవా విభాగంలో ఇటీవల పాండిచ్చేరిలో డాక్టరేట్ పొందిన జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్‌యాదవ్‌ను సోమవారం పలువురు ప్రముఖులు, గౌడ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు రమేష్‌గౌడ్, గట్టియాదవ్, సురేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు కోళ్ల వెంకటేష్, ప్రజా గాయకుడు రాజారాం ప్రకాష్, గంధం నాగరాజు, మాజీ కౌన్సిలర్లు బ్రహ్మచారి, ఉగ్గం తిరుమల్, మధుగౌడ్, ఉపాధ్యాయులు వరప్రసాద్‌గౌడ్, ఐక్యవేదిక నాయకులు వెంకటేశ్వర్లు, గౌనికాడి యాదయ్య, కొత్తగోళ్ల శంకర్, బొడ్డుపల్లి సతీష్, రవి, రాహుల్ పాల్గొన్నారు.

దంచికొడుతున్న వానలు



పెద్దచెరువు అలుగుపారడంతో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



అప్పారెడ్డిపల్లిలో కూలిన దారం వెంకటయ్య ఇల్లు

గోపాల్‌పేట: కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి మండలంలోని వాగులు, చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతున్నాయి. పొలికెపాడు గ్రామంలో వస్తున్న వాగునీటికి సమీపంలోని వరిపంటలు నీటమునిగి మేట వేశాయి. మండలంలోని సుమారు 190 ఎకరాలు పంట నీట మునిగిందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. పొలికెపాడు గ్రామంలో 2 ఎకరాలు మట్టి కొట్టుకువచ్చి వరిపంటలో మేటవేసింది. తాడిపర్తి గ్రామంలో ఓ మట్టిమిద్దె కూలిపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు ఇంటివద్దకు వెళ్ళి పరిశీలించారు. గోపాల్‌పేట నుంచి బుద్దారం వెళ్లే దారిలో చెట్లు విరిగి రోడ్డుపై పడగా ఎస్సై నరేష్‌కుమార్ సిబ్బంది కలిసి జేసీబీ సాయంతో చెట్లను తొలగించారు.

అలుగుపారిన చెరువు..

అమరచింత: కురుస్తున్న భారీ వర్షాలతో పాటు భూత్పూర్ రిజర్వార్ ఎడమ కాల్వ ద్వారా వస్తున్న వరదనీటితో అమరచింత పెద్దచెరువు సోమవారం అలుగుపారింది. గత పక్షం రోజుల నుంచి భూత్పూరు కాల్వ ద్వార చెరువుకు నీరు చేరుకుంటున్న నిండుకొని చెరువు కురిసిన వర్షాలకు ఎగువన ఉన్న గ్రామాల చెరువుల వరద నీటితో నిండుకుని అలుగు పారింది.

పెద్దచెరువు ఆక్రమణతో నీటమునిగిన పంటలు

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం పెద్దచెరువు అలుగు కొంత భాగం ఆక్రమణకు గురికావడంతో అలుగు ద్వారా నీళ్ల వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. ఇటీవల మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. పెద్దచెరువు అలుగు వద్ద కొందరు పట్టాదారులు భూమి తమకు పట్టా ఉందని కొంత భాగం ఎత్తుల చేసి పంట వేసుకున్నారు. దీంతో నీళ్ళు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. నీటిమట్టం పెరగడంతో వరి పంటలు నీటమునిగాయి. గ్రామానికి చెందిన పలువురు రైతులు యాదిరెడ్డి, యల్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తహసీల్దార్ సుగుణను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

భారీవర్షాలకు కూలిన ఇండ్లు.. పొంగిపొరుతున్న వాగులు

ఖిల్లాఘనపురం: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పెద్దఎత్తున పారుతున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని సల్కెలాపురంలో ఓ ఇల్లు, అప్పారెడ్డిపల్లిలో ఒకటి, ఉప్పరిపల్లిలో ఒకటి చొప్పున మూడు ఇళ్లు కూలిపోయినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. ఎంపీడీఓ సునిత పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. సోమవారం కూడా వర్షం పడడంతో పెద్దవాగు పొంగి పారింది.

భారీ వర్షాలకు కూలిన ఇండ్లు

వనపర్తి రూరల్: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు బెంబేలెత్తిపోతున్నారు. పాతఇండ్లు వర్షానికి మెత్తబడి కూలిపోతున్నాయి. మండలంలోని చిమనగుంటపల్లి గ్రామంలో కోట్ల చంద్రకళ, పెద్దగూడెం గ్రామంలో రవి, అంకూరు గ్రామంలో రెండు ఇళ్లు, పెబ్బేరు మండలంలోని సూగూరు గ్రామంలో ఆడెం దుబ్బన్న, శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల గ్రామంలో మంగలి తిరుపతయ్య, రాములమ్మ ఇంట్లో నివసిస్తున్నారు. వారు ఎవరులేని సమయంలో ఇళ్లు పడిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అధికారులు పర్యవేక్షించి బాధితులకు పరిహారం అందించాలని కోరారు. బాధితులకు డబుల్‌బెడ్రూంల ఇళ్లు కేటాయించాలని కోరారు.

అలుగుపారిన పెద్దచెరువు

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లి గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువు సోమవారం అలుగు పారడంతో పలువురు రైతులు తప్పెట్లతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీంతో సంగినేనిపల్లి, తూముకుంట గ్రామాల్లోని దాదాపు 800 ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు జగన్‌రెడ్డి, చిన్నారెడ్డి, రాజశేఖర్, రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు.



కిష్టాపూర్‌తండా సమీపంలో కోతకు గురైన కేఎల్ఐ ఎంజే-4 కాల్వ





సోళీపురం పెద్ద చెరువులో నీటమునిగిన వరి పంట



వెంగళాయిపల్లి సమీపంలో నీట మునిగిన వరి పంట



చిమనగుంటపల్లి గ్రామంలో కూలిన ఇల్లు

తాటిపాముల గ్రామంలో కూలిన ఇల్లు

'పది' విద్యార్థులపై దృష్టి సారించాలి

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించి వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని చిక్కేపల్లి ఉన్నత పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని, పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వార్షిక ప్రణాళిక, యూనిట్‌ప్లాన్, టీచింగ్ డైరీ, బోధన సోపానాలపై ఉపాధ్యాయులతో ఎంఈఓ చర్చించి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం తదితరులు పాల్గొన్నారు.



టీచింగ్ డైరీని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

వనపర్తి: బ్యాంకులను మోసం చేసి రూ.కోట్ల రుణం పొంది ఆర్థిక నేరానికి పాల్పడిన కేసులో నిందితులకు లబ్ధి చేకూర్చాలని చేసిన కుట్రలో భాగస్వామ్యం ఉన్న పట్టణానికి చెందిన గోనూర్ రమేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. కానిస్టేబుల్ రాకేష్ కేసులో కుట్ర పూరితంగా వ్యవహరించినందుకు సోమవారం పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. రాకేష్‌కు సహకరించడానికి రమేష్ ఆస్తులను ఏజీపీఏ చేసుకున్నట్లు గుర్తించామని తెలిపారు.

సీసీ కెమెరాల వితరణ

మదనాపురం: మండలంలోని జెడ్పీహెచ్ఎస్ దుప్పల్లి పాఠశాలకు సోమవారం సీసీ కెమెరాలు వితరణ చేశారు. 2000–01 పదో పూర్వ విద్యార్థులు సత్తయ్య, బండల్, లక్ష్మీనారాయణ, మధు, కలిసి నాలుగు సీసీ కెమెరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెచ్ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీలో నిర్వహించాలి

వనపర్తి రూరల్: ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించి, విద్యాబోధన బాధ్యతను టీచర్లకు, హెల్పర్‌కి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ ఎన్ రమేశ్, కార్యదర్శి మండ్ల రాజు, అంగన్‌వడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని మరికుంట నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలిగా వెళ్లి గేట్ దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రెవన్యూ భీమ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్ ,హెల్పర్స్ కి అదనపు బాధ్యతతో పాటు ,అదనపు వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీ యూ నాయకులు బొబ్బిలి నిక్సన్, రాము తదితరులు పాల్గొన్నారు.

నిరసనకు బయలుదేరిన అంగన్‌వాడీలు

వీపనగండ్ల: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమానికి మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, వెల్‌ఫేర్‌లు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్‌ల సంఘం నాయకులు సుగుణాబాయి, సువర్ణ, ఎల్లమ్మ, కృష్ణమ్మ, నాగేశ్వరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పర్లు గీత, నిరంజనమ్మ, రాధ, కవిత తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ గేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

నేతాజీ దేశ యువతకు ఆదర్శం

వనపర్తిటౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను దేశప్రజలు ఎన్నటికీ మరువరని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, వ్యాఖ్యాత నరసింహశర్మ, గాయకుడు కుర్మయ్య, రజక సంఘం నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింగిల్‌విండో భవనానికి భూమిపూజ

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సింగిల్‌విండో భవనానికి సోమవారం భూమిపూజ చేశారు. సింగిల్ విండో నిధుల ద్వారానే భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు విండో చైర్మన్ రామన్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో వైస్‌చైర్మన్ సరిత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మదన్‌మోహన్‌రావు, బ్రహ్మానందరెడ్డి, విండో డైరెక్టర్ నర్సింహ, రవీందర్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

అమరచింత: ఈనెల 19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా మల్కాజిరిలో జరిగే సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి రవీందర్ కోరారు. ఈ మేరకు సోమవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గోపాల్‌పేట: ఏదుల మండలంలోని గుండెవాల్యా తాండలో కొత్తగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.

పొలం వివాదంలో దాడి కేసునమోదు

పాన్‌గల్: పొలం వివాదంలో జరిగిన ఘర్షణలో ఒకరిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో ఒకరిపై కేసు నమోదైన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దావాజిపల్లి గ్రామానికి చెందిన జనిగే కురుమయ్య సోమవారం రోజు గ్రామంలోని రచ్చకట్ట దగ్గర గ్రామస్తులతో మాట్లాడుతుండగా ఇదే గ్రామానికి చెందిన జనిగే సత్తయ్య వచ్చి భూమి కౌలుకు ఇవ్వమంటే ఇవ్వడం లేదనే కోపంతో దూషిస్తూ కొడవలితో జనిగే కురమయ్యపై దాడిచేయగా తలకు రక్తగాయాలయ్యాయి. దాడి సమయంలో అడ్డుగా వచ్చిన జనిగే కుర్మయ్య భార్య పద్మను కూడా దూషించి పొలం కౌలుకు ఇవ్వకపోతే అసభ్య పదాలతో బెదిరించారన్నారు. దాడి చేసిన జనిగే సత్తయ్యపై తగుచర్యలు తీసుకోవాలని కుర్మయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బహుజన హక్కుల యోధుడు పాపన్నగౌడ్



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్

వనపర్తి: బహుజనుల హక్కుల కోసం పోరాడిన మహా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని.. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.కీమ్యానాయక్ అన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమానికి ఆయనతో పాటు ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ పి.శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మొఘల్ రాజుల కాలంలో బహుజనులకు జరిగిన అన్యాయాన్ని ఎదిరించారని, అందుకే ప్రభుత్వం ఏటా ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. సంక్షేమ ఫలాలు బహుజనులకు చేరడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య మాట్లాడుతూ.. పాపన్నగౌడ్‌ను ఇండియన్ రాబిన్‌హుడ్‌గా అభివర్ణించారని, ధనవంతులను దోచి పేద, అణగారిన వర్గాలకు పంచిపెట్టారని గుర్తుచేశారు. వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలోని ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ చేసుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లాలో శిథిలావస్థకు చేరిన సర్వాయి పాపన్న కోటను అభివృద్ధి చేసేందుకు రూ.4.70 కోట్లు కేటాయించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా జనగామ జిల్లా పేరును సర్వాయి పాపన్న పేరుగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, బీసీ సంక్షేమశాఖ అధికారి పాండు, జిల్లా అధికారులు, సంఘ నాయకులు సైతం సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వనపర్తిటౌన్: బహుజన వీరుడు, తెలంగాణ చత్రపతి శివాజీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా గౌడసంఘం అధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజాగారి బంగ్లాలో పాపన్నగౌడ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్ మాజీ రమేష్‌గౌడ్, జిల్లా గౌడసంఘం నాయకులు, గీత కార్మిక సొసైటీ అధ్యక్షులు రామస్వామిగౌడ్, సురేష్‌గౌడ్, ప్రజాసంఘాల నాయకులు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసినా ఇప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో బాధకరమన్నారు. అనంతరం రాజారామ్‌ప్రకాశ్, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్‌లను శాలువాతో సన్మానించారు. అదేవిధంగా గౌడసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజీవ్‌చౌక్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీచైర్మన్ గట్టు యాదవ్, మాజీచైర్మన్ బండారు కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, వరప్రసాద్ గౌడ్, మాజీ కౌన్సిలర్ బ్రహ్మం, కాంగ్రెస్ నాయకులు యాపర్ల రామ్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు కె.వెంకటేష్, నాగరాజు, గౌడ సంఘం, గీత కార్మిక సొసైటీ నాయకులు సురేష్‌గౌడ్, రాములుగౌడ్, కృష్ణయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు అరుణ్, అఖిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ సేవలు మరువ లేనివి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో సోమవారం పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు చిన్న అంజనేయులుగౌడు ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంతంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేశారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మాజీసర్పంచ్ కృష్ణయ్యగౌడ్, మన్యంగౌడ్, నాగేంద్రంగౌడ్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ళకృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, మండల బీజేపీ అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు భూమయ్య హాజరై పూలమాలలు వేశారు. కార్యక్రమంలో అరుణరాణి సురేందర్, క్యామ వెంకటేష్, గోపాల్, గొడుగు సత్యం, కమ్మరి గోపి, మంగళి ఆశన్న, అంజనేయులుగౌడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా సోమవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కడుకుంట్ల గ్రామంలో, పెబ్బేరు మండల కేంద్రంలోని సుభాష్‌చౌరస్తాలో పలువురు గౌడ సంఘం నాయకులు పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, అక్కి శ్రీనివాస్‌గౌడ్, సురెందర్‌గౌడ్, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్‌సర్వాయి జయంతి

ఆత్మకూర్: బహుజనుల ఆశాజ్యోతి పాపన్నగౌడ్ జయంతిని పట్టణంలో గీతకార్మికులు నిర్వహించారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో పాపన్నగౌడ్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

బహుజన పోరాటయోధుడు సర్దార్‌పాపన్న

పాన్‌గల్: బహుజన పోరాటయోధుడు సర్దార్‌పాపన్న జయంతిని సోమవారం మండలగౌడ సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంతో పాటు దావాజిపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. దావాజిపల్లి గ్రామంలో పాపన్న విగ్రహ ఏర్పాటుకు సంఘం నాయకులు భూమి పూజ నిర్వహించారు.

ఘనంగా పాపన్నగౌడ్ జయంతి

కొత్తకోట: సర్దార్ పాపన్నగౌడ్ జయంతి పట్టణంలోని చౌరస్తాలో మండలగౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన జయంతి జరుపుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీజిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటన్నగౌడ్, తిరుపతన్నగౌడ్, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు



కొత్తకోట రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి–ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రతిష్ఠించారు. విశిష్ట పూజలందుకుని సోమవారం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, పురుషోత్తం, మాసన్న, శైలజ, జ్యోతి, శంకరమ్మ తదితరులు జిల్లా కమిటీ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కంటి శస్త్ర చికిత్సలు సోమవారంతో ముగిసింది. ఎన్ఆర్ఐ తిప్పిరెడ్డి రాంచంద్రారెడ్డి సహకారంతో చెన్నై యూనిట్‌కు చెందిన శంకర్ నేత్రాలయ మొబైల్ కంటి సర్జరీలు చేశారు. 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 53 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేశారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర

అచ్చంపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌నాయక్ ఆరోపించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఐసీడీఎస్ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లతో నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, వెల్పేర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని, ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్య అమలు నిర్ణయం సరికాదన్నారు.